క్లుప్తంగా

విద్యుత్ తీగలపై పడిన సెంట్రల్ లైటింగ్ స్తంభం



పెడన: పట్టణంలోని ప్రధాన రహదారిలో ఉన్న సెంట్రల్ లైటింగ్‌కు సంబంధించి పెడన – గుడివాడ రోడ్డు శివారున డంపింగ్ యార్డు సమీపంలో పోల్ ఒకటి బుధవారం మధ్యాహ్నం గాలి వానకు పడిపోయింది. రోడ్డు మార్జిన్‌లో ఉన్నటువంటి విద్యుత్ తీగలపై పడటంతో ఆ సమయంలో వాహనాల రాకపోకలు లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. విద్యుత్ తీగలపై పడటంతో పెద్ద వెలుగు వచ్చిందని, విద్యుత్ సరఫరా నిలిచిపోయిందని స్థానికులు తెలిపారు. మున్సిపల్ అధికారులు, విద్యుత్‌శాఖ సిబ్బంది తక్షణ మరమత్తులు చేపట్టి సెంట్రల్ లైటింగ్ పోల్‌ను తొలగించి విద్యుత్ తీగలను సరిచేసి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు.

వసతి గృహం పరిశీలన

మచిలీపట్నంటౌన్: నగరంలోని ఎస్సీ బాయ్స్ కళాశాల వసతి గృహాన్ని ఎస్ఎఫ్ఐ నాయకుల బృందం బుధవారం రాత్రి పరిశీలించింది. వసతి గృహంలో దోమలు స్వైర విహారం చేస్తున్నాయి. దోమతెరలు, డోర్లకు మెస్‌లు ఏర్పాటు చేయకపోవడాన్ని గమనించారు. ఒక గదిలో ఫ్యాన్ లేక విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారని, ఒక్కో గదిలో పది మంది విద్యార్థులు ఇబ్బందికరంగా ఉండటాన్ని గమనించారు. మెస్‌చార్జీలు నెలకు రూ. 1500 మాత్రమే ఇస్తున్నారని, ప్రతి విద్యార్థికి రూ.2 వేల మెస్ చార్జీలు చెల్లించాలని నాయకులు డిమాండ్ చేశారు. అలాగే కాస్మోటిక్ చార్జీలు వెంటనే విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎస్ సమరం, మచిలీపట్నం మండల కార్యదర్శి ప్రదీప్, జిల్లా కమిటీ సభ్యులు బషీమ్, మండల కమిటీ సభ్యుడు జైకర్, సీఐటీయూ నాయకులు వై నరసింహారావు, బి సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

సాగులో మేలైన పద్ధతులపై శిక్షణ

కేవీకే శాస్త్రవేత్త సుధారాణి



నాగాయలంక: ఆచార్య ఎన్.జి రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిధిలోని ఘంటసాల కృషి వి/జ్ఞాన కేంద్రం (కేవీకే) వ్యవసాయ శాస్త్రవేత్తల బృందం ఆధ్వర్యంలో వరి, మినుము పంటల సాగులో మేలైన యాజమాన్య పద్ధతులపై బుధవారం నాగాయలంక రైతు సేవా కేంద్రంలో శిక్షణ నిర్వహించారు. కేవీకే సమన్వయకర్త డాక్టర్ డి.సుధారాణి మాట్లాడుతూ పంటల సాగులో రైతులు రసాయనాలు అధికమొత్తంలో వినియోగిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. దీని ఫలితంగా ఖర్చులు పెరిగి నికర ఆదాయం తగ్గుతుందని పేర్కొన్నారు. వరిపంట, ఎలుకల నిర్మూలనలో యాజమాన్య పద్ధతులపై మెలకువలను వివరించారు. మినుము పంటలో విత్తన ఎంపిక, విత్తన శుద్ధి, వైరస్, తెగుళ్ల సమగ్ర యాజమాన్యం తదితర అంశాలపై రైతులకు శిక్షణ ఇచ్చారు. వ్యవసాయ పథకాలపై అవనిగడ్డ ఏడీఏ జయప్రద అవగాహన కలిగించారు. ఏఓ ఎ.సంజీవ్ కుమార్, కేవీకే శాస్త్రవేత్తలు రేవతి రెడ్డి, వెంకటలక్ష్మి, యశ్వంత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వెంకటకృష్ణారావుకు నివాళి

నాగాయలంక: దివిసీమ కాంగ్రెస్ రాజకీయ యోధుడు, దివంగత ఉమ్మడి రాష్ట్ర మాజీ మంత్రి మండలి వెంకట కృష్ణారావు రాజకీయల్లో సామాజిక సేవలను మిళితం చేసి ప్రజలకు మేలు చేసిన మహనీయుడని పలువురు కొనియాడారు. ఎంవీకేరావు శత నిర్వహణ కమిటీ ఆధ్వర్యంలో 73 వరోజు నాగాయలంక సాయిబాబా మందిరం కూడలిలో మండలి విగ్రహానికి పలువురు నివాళులర్పించారు. తొలుత సివిల్ ఇంజినీర్ కర్రా రవి (ముంబయి) పూలమాలలు వేశారు. డీసీ చైర్మన్ బండ్రెడ్డి చినబాబు, మహిళా నేతలు తలశిల స్వర్ణలత, భోగాది అనురాధ, మెండు లక్ష్మణరావు(చంటి),చన్నగిరి లతా మోహన్, గుడివాక శివాజి తదితరులు పాల్గొన్నారు.

పరిష్కారం కాని పాఠశాల డ్రెయినేజీ సమస్య

బంటుమిల్లి: మండల పరిధిలోని మల్లంపూడి ఉన్నత పాఠశాల డ్రెయినేజీ సమస్య పరిష్కారం కాక పాఠశాల ఆవరణలో నిలిచిన మురుగునీరు, బురద కారణంగా ఉపాధ్యాయులు, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. తహసీల్దార్ కేవీ పూర్ణచంద్రరావు, ఎస్ఐ గణేష్‌కుమార్‌లు సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టారు. ఈ స్థితిలో ఆక్రమణదారులు గ్రామ పెద్దలకు సహకరించకపోవడంతో అధికారులు చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. దీంతో ఆక్రమణదారులను వారి వద్ద ఉన్న పత్రాలు తీసుకుని రావాలని తాహసీల్దార్ పూర్ణచంద్రరావు ఆదేశించారు. సరైన ధ్రువీకరణ పత్రాలు లేకపోతే జిలా సర్వేయరుతో సర్వే చేయించి చట్టపరంగా చర్యలు తీసుకుంటామని తెలియజేశారు.

జలాశయాలను తలపిస్తున్న

అంతర్గత రహదారులు!

- తీరప్రాంత గ్రామాల్లో అధ్వానంగా రోడ్లు
- నడిచేందుకు వీలులేని విధంగా మారిన వైనం
- పట్టించుకోని అధికార యంత్రాంగం

ఏటిమొగ(నాగాయలంక): తీరగ్రామాల్లో అంతర్గత రహదారులు అస్తవ్యస్తంగా మారడంతో ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారు. మత్స్యకారులు నివాసిత ప్రధాన గ్రామం అయిన ఏటిమొగలో ప్రధాన రోడ్డు తరచూ జలాశయాన్ని తలపిస్తుంది. వర్షం కురిస్తే నీళ్లలో నుంచే రాకపోకలు సాగించాల్సి వస్తుంది. అంతర్గత రోడ్లు సైతం నీటి గుంతలు, బురద కయ్యలుగా మారడంతో జనం నరక యాతన అనుభవిస్తున్నారు. ఏటిమొగ గ్రామం మొగదల నుంచి రైస్ మిల్లు ఎగువ వరకు పూర్తిగా నీటితో నిండిపోతుంది. ఎవరూ పట్టించుకోవడం లేదని గ్రామస్తులు వాపోతున్నారు. గత కొద్ది రోజులు నుంచి జలాశయంలా ఉన్న మెయిన్ రోడ్డుపై నీటిని బుధవారం ఉదయం గ్రామస్తులు తోడించుకున్నారు. పంచాయతీ అధికారుల సైతం పట్టించుకోక పోవడంతో ఎవరో గ్రామస్తులు ఇంటి వద్ద సెర్మనీ ఉండటంతో గత్యంతరంలేక బంధువులు రాకపోకలకు ఇబ్బందులు కలుగకుండా ఆయిల్ ఇంజిన్‌తో సొంతంగా నీటిని తొలగించారు. కొన్ని అంతర్గత రహదారులు తాత్కాలిక మరమ్మతుల పేరుతో ప్యాచ్‌వర్కులు చేస్తున్నా ఫలితం శూన్యమై తారురోడ్లు కనుమరుగయ్యాయి. కొద్దిపాటి వర్షానికే ఆ రోడ్లు దారుణంగా మారుతున్నాయి. మండలంలోని భావదేవరపల్లి ప్రధాన రోడ్డు ప్రస్తుతం భారీ గుంతలతో అధ్వానంగా మారి వర్షం పడితే ప్రధాన మార్గమంతటా నీటి గుంతలే కనిపిస్తున్నాయి. దిగువన తీరప్రాంతమైన పెద పాలెం-పర్రచివర ప్రధాన మార్గం పూర్తిగా శిథిలమై గుంతలతో తీరగ్రామాల ప్రజలకు అగచాట్లు తప్పడంలేదు. మర్రిపాలెం-నాలి, చోడవరం -భావదేవరపల్లి రోడ్లు భారీ గుంతలతో ద్విచక్ర వాహనాలు నడవడం కూడా కష్టంగా మారింది.



ఏటిమొగ గ్రామంలో జలాశయంగా మారి కనిపించకుండా పోయిన మెయిన్ రోడ్డు



ప్యాచ్ వర్కుల పేరుతో మరమ్మతులు చేసిన నంగేగడ్డ-చోడవరం రోడ్డు దుస్థితి



మర్రిపాలెం-నాలి ప్రధాన మార్గంలో అధ్వానంగా రహదారి



నంగేగడ్డ వద్ద తారు రోడ్డుపై ఏర్పడిన భారీ గుంతలు

పకడ్బందీగా దీపావళి షాపుల ఏర్పాటు

ఆర్డీవో కె.స్వాతి



మాట్లాడుతున్న ఆర్డీవో స్వాతి

చిలకలపూడి(మచిలీపట్నం): బాణసంచా విక్రయ దుకాణాల ఏర్పాటు పకడ్బందీగా నిర్వహిస్తున్నట్లు ఆర్డీవో కె.స్వాతి తెలిపారు. మండల పరిధిలోని తహసీల్దార్లు, పోలీస్ అధికారులు, షాపుల నిర్వాహకులతో బుధవారం ఆమె సమావేశం నిర్వహించారు. అనంతరం ఆమె విలేకర్లతో మాట్లాడారు. వ్యాపారులు ఈ నెల 17వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తుతో పాటు ఫొటో, ఆధార్‌కార్డు నకలు, జీఎస్టీ అధికారుల నుంచి రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్ జత పరచాలని పేర్కొన్నారు. వచ్చిన దరఖాస్తులను పరిశీలించి తాత్కాలిక లైసెన్సులు అందజేస్తామన్నారు. ఈ నెల 19, 20 తేదీల్లో మాత్రమే సామగ్రి అమ్ముకునేందుకు అనుమతులు ఇస్తున్నామన్నారు. మండల కేంద్రాల్లో షాపుల ఏర్పాటుకు అధికారులు చర్యలు తీసుకుంటారని వెల్లడించారు. మచిలీపట్నం నగరంలో వచ్చిన దరఖాస్తులను బట్టి తాము షాపుల ఏర్పాటు ప్రాంతాన్ని నిర్ణయిస్తామని వివరించారు. దరఖాస్తుదారులకు తాత్కాలిక లైసెన్సులతో పాటు పోస్టల్ డిపార్ట్‌మెంట్ ద్వారా ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పిస్తున్నామన్నారు. అలాగే వివిధ శాఖల అధికారులు షాపులను ఏర్పాటు చేసే ప్రాంతంలో కావాల్సిన మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేయాలన్నారు. షాపులను రేకులషెడ్డుతోనే ఏర్పాటు చేసుకోవాలని, ప్రతి షాపు వద్ద వాటర్ డ్రమ్ములు, ఇసుక మూటలు ఉంచుకోవాలన్నారు. ప్రతి షాపునకు మూడు మీటర్ల దూరం ఉండాలన్నారు. అనుమతులు లేకుండా ఎక్కడైనా బాణసంచా అమ్మకాలు చేపడితే కఠినమైన చర్యలు ఉంటాయని హెచ్చరించారు.

అబ్దుల్ కలామ్ సేవలు ఎనలేనివి

అవనిగడ్డ: మాజీ రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్ కలాం జయంతి వైఎస్సార్ సీపీ కార్యాలయంలో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు అబ్దుల్ కలాం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వైఎస్సార్ సీపీ కృష్ణా జిల్లా పంచాయతీరాజ్ విభాగం అధ్యక్షుడు సింహాద్రి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ భారతదేశానికి అబ్దుల్ కలాం చేసిన సేవలు ఎనలేనివని కొనియాడారు. ప్రతి ఒక్కరికీ ఆయన జీవితం ఆదర్శనీయమని చెప్పారు. జెడ్పీటీసీ సభ్యుడు చింతలపూడి లక్ష్మీనారాయణ(లచ్చి), వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు రేపల్లె శ్రీనివాసరావు, రాష్ట్ర ప్రచార విభాగం ప్రధాన కార్యదర్శి గాజుల జయగోపాల్ (గోపి), నియోజకవర్గ యువజన విభాగం అధ్యక్షుడు చింతలపూడి బాలభాస్కర్ (బాలు), పాత ఎడ్లంక మాజీ సర్పంచ్ సైకం బాబూరావు, పార్టీ నాయకులు గరికపాటి కృష్ణారావు, కొల్లాల మధు, బచ్చు నాగమల్లేశ్వరరావు(బుజ్జి), రేపల్లె దామోదర్, కొండవీటి రాంప్రసాద్, ముస్లిం మైనార్టీ నాయకులు షేక్ రియాజ్ బాషా, సత్యనారాయన, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



కలాం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న పార్టీ నాయకులు

కృష్ణా యూనివర్సిటీ ఇంజినీరింగ్ కళాశాలలో అబ్దుల్ కలాం జయంతి వేడుకలు

కోనేరుసెంటర్: కృష్ణా విశ్వవిద్యాలయం ఇంజినీరింగ్ కళాశాలలో మాజీ రాష్ట్రపతి డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం జయంతి ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఉపకులపతి ఆచార్య కె.రాంజీ మాట్లాడుతూ పేద కుటుంబం నుంచి వచ్చిన అబ్దుల్ కలాం అత్యున్నత స్థాయికి ఎదిగిన క్రమాన్ని విద్యార్థులకు వివరించారు. ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఆర్.విజయకుమారి అబ్దుల్ కలాం జీవితంలోని పలు విశేషాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య ఎన్.ఉష, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ పి. గోపి, ఆర్.దుర్గాప్రసాద్, కె.కవిత ఇతర బోధనా సిబ్బంది పాల్గొన్నారు.

మచిలీపట్నంటౌన్: ఏపీజే అబ్దుల్ కలాం జయంతి కార్యక్రమాన్ని బుధవారం స్థానిక జిల్లా గ్రంథాలయంలో నిర్వహించారు. కలాం చిత్రపటానికి డెప్యూటీ లైబ్రేరియన్ బి.వెంకటరమణ పూలమాల వేసి నివాళులర్పించారు.

డిగ్రీ కళాశాలలో జాబ్‌మేళా

అవనిగడ్డ: స్థానిక ఎస్‌వీఎల్ క్రాంతి డిగ్రీ కళాశాలలో రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో బుధవారం జాబ్‌మేళా నిర్వహించారు. గ్రామీణ యువజన వికాస సమితి అధ్యక్షుడు మండలి వెంకట్రామ్ జాబ్‌మేళాని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గ యువతకు ఉద్యోగాల కల్పనకు ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్ విశేష కృషి చేస్తున్నారన్నారు. ఈ జాబ్ మేళాకు 147 మంది హాజరు కాగా, 116 మంది షార్ట్ లిస్ట్ అయ్యారాన్నరు. కార్యక్రమంలో ఎస్‌వీఎల్ క్రాంతి డిగ్రీ కళాశాల ఛైర్మన్ దుట్టా ఉమామహేశ్వరరావు, జిల్లా ప్లేస్‌మెంట్ అధికారి మధుకుమార్, అవనిగడ్డ ప్రభుత్వ డిగ్రీ కళాశాల స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ కో-ఆర్డినేటర్ పృధ్వీజ, రాచూరి ప్రశాంత్ పాల్గొన్నారు.

ఆడపిల్లలను రక్షించుకుందాం



కృత్తివెన్ను: సృష్టికి మూలమైనటువంటి ఆడపిల్లలను రక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని కృత్తివెన్ను పీహెచ్‌సీ వైద్యురాలు మిధున అన్నారు. బుధవారం స్థానిక ఆస్పత్రిలో లింగ వివక్ష నిర్మూలన అనే అంశంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ లింగ వివక్ష అంతం, బాలికా సంక్షేమమే లక్ష్యం అనే నినాదంతో ప్రతి ఒక్కరూ బాలికల సంరక్షణ కోసం కృషి చేయాలని కోరారు. భవిష్యత్తులో అమ్మాయిలు లేకపోతే అమ్మతనమే ఉండదన్నారు. స్త్రీ పురుషులు సమానమన్న విషయాన్ని ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌వో గంగాధర్, సూపర్‌వైజర్ మేరీ ఆరోగ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి ఫుట్‌బాల్ పోటీలకు ఎంపిక

కోడూరు: రాష్ట్ర స్థాయిలో జరిగే ఫుట్‌బాల్ పోటీల్లో ఆడేందుకు మండలంలోని లింగారెడ్డిపాలెం జెడ్పీ పాఠశాల విద్యార్థులు ఎంపికయ్యారు. ఇటీవల స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో విజయవాడలోని ఇందిరా గాంధీ మున్సిపల్ స్టేడియంలో అండర్-14, 17 విభాగాల్లో ఫుట్‌బాల్ పోటీలకు సంబంధించి విద్యార్థుల ఎంపిక జరిగిందని చెప్పారు. అండర్-14 విభాగంలో లింగారెడ్డిపాలెం పాఠశాలకు చెందిన షేక్ రేష్మ (9వ తరగతి), జరుగు మేఘన (9వ తరగతి), బెల్లంకొండ సిరి (7వ తరగతి), అండర్-17 విభాగంలో తొమ్మిదవ తరగతికి చెందిన గాదె కావ్య, శీలంశెట్టి హారిక, పేరె రమ్య, కారంకి భాగ్యశ్రీ, షేక్ మాలిన్‌లు ఎంపికైనట్లు హెచ్‌ఎం కె.నాగరత్నకుమారి బుధవారం తెలిపారు. ఎనిమిది మంది విద్యార్థినులు కృష్ణా జిల్లా తరుపున రాష్ట్ర స్థాయి పాల్గొంటారని చెప్పారు. ప్రతిభ చాటిన విద్యార్థినులతో పాటు వీరికి శిక్షణ ఇచ్చిన పీడీ అప్పికట్ల వెంకటతాతాజిరావులను గ్రామ ప్రముఖులు, ఉపాధ్యాయులు అభినందించారు.

టపాసుల దుకాణాల లైసెన్సులకు క్యూ!


పెడన: దీపావళి పర్వదినాన్ని పురస్కరించుకుని ఈ నెల 20వ తేదీకి ముందు రెండు రోజుల నుంచి టపాసుల దుకాణాలను ఏర్పాటు చేసుకుని విక్రయించడానికి వ్యాపారులు ముందుకు వస్తున్నారు. అయితే వీరికి లైసెన్సులు జారీ విషయంలో రెవెన్యూ అధికారులు స్పష్టమైన నిబంధనలు పాటించాల్సిందేనని ఆదేశాలు జారీ చేయడంతో ఏం చేయాలనే ఆలోచనల్లో వ్యాపారులు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. అయితే వీరికి అండగా తెలుగు తమ్ముళ్లు భరోసా ఇస్తూ ఆఖరి నిమిషంలో అయినా దుకాణాలను ఏర్పాటు చేయడానికి పరిస్థితిని చక్కబెడతామనే భరోసా కల్పిస్తూ ముందుకు కదులుతుండటం గమనార్హం. మున్సిపల్, పోలీస్, రెవెన్యూ, ఫైర్ డిపార్ట్‌మెంట్ తదితర శాఖలకు చెందిన అధికారులు సైతం టపాసుల విక్రయ స్థలాన్ని పరిశీలించి అంతా ఆమోదించాల్సి ఉంటుంది. దుకాణాలు ఏర్పాటు చేసే సమయం కూడా తక్కువగా ఉందనే వాదనలు వ్యక్తమవుతున్నాయి. రెవెన్యూ అధికారులకు అందిన దరఖాస్తులను బట్టి స్థలం ఎంత అవసరం, ఆయా దుకాణాలు ఏర్పాటుకు ఆ స్థలం సరిపోతుందా లేదా అనేది కూడా పరిశీలించాలి. గత ఏడాది ఏర్పాటు చేసిన పెడన-గుడివాడ బైపాస్ రోడ్డులోని వై జంక్షన్ సమీపంలో ఖాళీ స్థలాన్ని తిరిగి కేటాయిస్తారా అనే సందేహాలు కూడా వ్యక్తమవుతున్నాయి. దరఖాస్తులను పరిశీలిస్తే 16 నుంచి 20కు పైగా వచ్చాయి. 20 దుకాణాలకు లైసెన్సులు జారీ చేస్తే నిరుడు కేటాయించిన స్థలం సరిపోదు. అర ఎకరానికి ఎక్కువ..ఎకరానికి తక్కువగా ఉన్న ఆ స్థలంలో దుకాణాలు పక్కపక్కనే, ఎదురెదురుగా ఏర్పాటు చేసుకోవాల్సిన దుస్థితి వస్తుంది. నిబంధనల ప్రకారం ముందుగా దుకాణాలు ఏర్పాటు చేసుకుంటే వాటిని పరిశీలించి లైసెన్సులు జారీ చేస్తామని పెడన ఇన్‌చార్జి తహసీల్దారు కె.అనిల్‌కుమార్ చెప్పారు.

కల్తీ మద్యం, బెల్ట్ షాపుల నియంత్రణకు ఉద్యమం

ఐద్వా జిల్లా అధ్యక్షురాలు బసవపూర్ణమ్మ

మచిలీపట్నంటౌన్: కూటమి ప్రభుత్వ హయాంలో కల్తీ మద్యం ఏరులై పారుతోందని, బెల్ట్ షాపులు విచ్చల విడిగా ఏర్పాటు చేశారని వీటి నివారణకు అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) ఆధ్వర్యంలో ఉద్యమం నిర్వహిస్తామని ఆ సంఘ కృష్ణా జిల్లా అధ్యక్షురాలు చేబ్రోలు బసవపూర్ణమ్మ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కూటమి పాలనలో మద్యాన్ని నియంత్రిస్తామని హామీ ఇచ్చి ప్రస్తుతం బెల్ట్ షాపులు లెక్కలేని విధంగా ఏర్పాటు చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. పాఠశాలలు, దేవాలయాలు, ప్రజల నివాస ప్రాంతాల్లో మద్యం దుకాణాలు ఏర్పాటు చేస్తున్నారని తెలిపారు. మద్యంతో పేదలు ఆర్థికంగా దెబ్బతింటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎంతోమంది అభాగ్యులు ప్రాణాలను కోల్పోతున్నారని విచారం చెందారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత మద్యాన్ని నియంత్రించకపోగా కల్తీ మద్యాన్ని విచ్చలవిడిగా అమ్మడంతో ఎంతోమంది ప్రాణాలు కోల్పోతున్నారని దీనికి ఎవరు బాధ్యత వహిస్తారని ప్రశ్నించారు. కల్తీ మద్యాన్ని వెంటనే నివారించాలని, బెల్ట్ షాపులను తీసివేయాలని డిమాండ్ చేశారు.

వ్యక్తిగత రక్షణ లేకుండా ఆస్తులు రాయవద్దు



బంటుమిల్లి: వృద్ధాప్యంలో భార్యాభర్తలు వ్యక్తిగత రక్షణ, అవసరాలు, అండ చూసుకోకుండా ఆస్తులు కుమారులు, కుమార్తెల పేరున రాయవద్దని బందరు ఆర్డీవో స్వాతి సూచించారు. స్థానిక విశ్రాంత ఉద్యోగుల సంఘ కార్యాలయంలో బుధవారం వయో వృద్ధుల దినోత్సవం నిర్వహించారు. సంఘం అధ్యక్షుడు చండిక గంగాజలరావు అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో ఆర్డీవో మాట్లాడారు. ఎన్‌టీఆర్ జిల్లా సంఘ కార్యదర్శి, రాష్ట్ర కమిటీ సభ్యులు మోత్కూరి వెంకటేశ్వరరావు, బంటుమిల్లి మండల సంఘ అధ్యక్షుడు యాళ్ళ శ్యాంబాబు పలు విషయాలను ఆర్డీవో దృష్టికి తెచ్చారు. ఈ సందర్భంగా తన కుమారులు తన ఆస్తిని స్వాధీనం చేసుకుని తనకు అన్యాయం చేశారంటూ కృత్తివెన్ను మండలం, లక్ష్మీపురం గ్రామానికి చెందిన పులగం రామతులసి ఆర్డీవోకి ఫిర్యాదు చేసింది. అలాగే బంటుమిల్లి మండలం, రామవరపుమోడి గ్రామానికి చెందిన కట్టా దమయంతమ్మ, పల్లికొండవారి మోడి గ్రామానికి చెందిన పల్లికొండ అమలకుమార్‌లు వారికి జరిగిన అన్యాయం గురించి వివరించి న్యాయం చేయమని వేడుకున్నారు. దీనిపై స్పందించిన ఆమె సమస్యలపై పూర్తి విచారణ చేయాలని బంటుమిల్లి, కృత్తివెన్ను తహసీల్దార్లు కేవీ పూర్ణ చంద్రరావు, ఎల్. శశికుమార్‌లను ఆదేశించారు.

పీఎం ఆదర్శ గ్రామీణ యోజనలో లంకలకలువగుంట

పెడన: ప్రధాన మంత్రి ఆదర్శ గ్రామీణ యోజన కింద మండల పరిధిలోని లంకలకలువగుంట గ్రామం ఎన్నుకోబడిందని ఎంపీడీవో ఎ.అరుణకుమారి తెలిపారు. గ్రామంలో బుధవారం ఆమె విస్తృతంగా పర్యటించి పారిశుద్ధ్యంపై పరిశీలించి అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె గ్లోబల్ హ్యాండ్ వాషింగ్ డే సందర్భంగా చిన్నారులకు పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. చేతులు శుభ్రం చేసుకోవడం తదితర వాటిని తెలియజేయడమే కాకుండా చిన్నారులను తిరిగి అడిగి ఏ విధంగా చేయాలనే దానిపై తర్ఫీదు ఇచ్చారు. ఈ సందర్భంగా గ్రామస్తులను ఆమె పలు విషయాలు అడిగి తెలుసుకున్నారు. ప్రధానమంత్రి ఆదర్శ గ్రామీణ యోజన కింద గ్రామం ఎంపికైనందున గ్రామానికి రూ.20 లక్షలు మంజూరవుతాయని తెలిపారు. వివిధ అభివృద్ధి పనులు, మంచినీటి సరఫరా నిధులను వెచ్చించడానికి అవకాశం ఉందన్నారు. అనంతరం రక్షిత మంచినీటి పథకం వద్ద వాటర్ ఫిల్టర్ బెడ్స్‌ను పరిశీలించి సిబ్బందికి తగు సూచనలు జారీ చేశారు. సచివాలయం పంచాయతీ కార్యదర్శి శిరిష తదితరులున్నారు.



గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎంపీడీవో అరుణకుమారి

భూసారంపై అవగాహన తప్పనిసరి

పెడన: ప్రతి రైతు తాను పండించే పంట భూమికి సంబంధించిన భూసారంపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని వ్యవసాయశాఖ కృష్ణా జిల్లా డెప్యూటీ డైరెక్టర్ మనోహరరావు తెలిపారు. మండల పరిధిలోని నడుపూరు రైతు సేవా కేంద్రంలో ప్రధానమంత్రి రాష్ట్రీయ కృషి వికాస్ యోజన కింద బుధవారం అవగాహన కల్పించారు. మనోహరరావు మాట్లాడుతూ మట్టిపై పట్టు సాధిస్తే పంట దిగుబడి రాబట్టడానికి తగు సూచనలు పాటిస్తూ కృషి చేయడం సులభమవుతుందన్నారు. జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయశాఖ డెప్యూటీ డైరెక్టర్ జ్యోతిరమణి మాట్లాడుతూ మట్టి నమూనాల ప్రాముఖ్యత, మట్టి నమూనాలు ఎలా సేకరించాలో రైతులకు వివరించారు. ఏవో పద్మజారాణి మాట్లాడుతూ రైతులు సాయిల్ హెల్త్ కార్డులు ఏ విధంగా పొందాలో వాటి గురించి తెలియజేశారు. రైతులు ఈ పంట నమోదు తప్పనిసరిగా చేసుకోవాలని రైతులకు సూచించారు. పెడన మండలానికి మొత్తం 18 ధాన్యం కొనుగోలు మండల వ్యవసాయ అధికారిని ఎస్.జెన్నీ కేంద్రాలను ఏర్పాటు చేయనున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో సాయి కిరణ్, నీటి సంఘం నాయకులు వెంకటేశ్వరరావు, నడుపూరు గ్రామ రైతులు, గ్రామ వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వ్యవసాయశాఖ డీడీ మనోహర్‌రావు

చెరువు ఫెన్సింగ్ పనులకు భూమిపూజ

గూడూరు: ముక్కొల్లు గ్రామంలో పలు అభివృద్ధి పనులకు జెడ్పీ చైర్‌పర్సన్ ఉప్పాల హారిక రాము రూ.65.75 లక్షలు మంజూరు చేశారని గ్రామ సర్పంచ్ సమ్మెట జయవర్ధన్ అన్నారు. రూ.20 లక్షల వ్యయంతో చేపట్టిన ముక్కొల్లు సామూహిక రక్షిత నీటి పథకం చెరువుకు ఫెన్సింగ్ పనులకు జయవర్ధన్ బుధవారం భూమి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటికే రూ.20లక్షలతో సామూహిక రక్షిత నీటి పథకం ఫిల్టర్‌బెడ్ల ఆధునికీకరణ పూర్తి చేశామని తెలిపారు. గ్రామంలో పాడైన అంతర్గత జీఎస్పీ రోడ్ల నిర్మాణానికి రూ.12లక్షలు, సిమెంటు రోడ్ల నిర్మాణానికి రూ.8.75 లక్షల జెడ్పీ నిధులు మంజూరయ్యాయని పేర్కొన్నారు. శ్మశాన వాటికలో షెల్టర్ నిర్మాణానికి రూ.5లక్షలు కేటాయించారన్నారు. ముక్కొల్లు గ్రామానికి నిధుల కేటాయింపులో అత్యంత ప్రాధాన్యత ఇచ్చిన ఉప్పాల హారిక, రాములకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు యర్రంశెట్టి శ్రీనివాసరావు, ఉప సర్పంచ్ సమ్మెట చంతన్‌కుమార్, వార్డు సభ్యులు పాల్గొన్నారు.



ఫెన్సింగ్ పనులకు భూమి పూజ నిర్వహిస్తున్న సమ్మెట జయవర్ధన్

ఆస్పత్రిలో అక్రమ వసూళ్లపై ఫిర్యాదు

మచిలీపట్నంఅర్బన్: ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి ఎంఆర్ఐ స్కానింగ్ విభాగంలో రోగుల నుంచి సిబ్బంది అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారని కృష్ణా జిల్లా బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు శేకుబోయిన సుబ్రహ్మణ్యం ఆరోపించారు. నగదు వసూళ్లలో వ్యత్యాసం, రక్త సేకరణలో నిర్లక్ష్యం వంటి అంశాలపై బుధవారం ఆసుపత్రి డెప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ భానుమూర్తి, ఆర్ఎంఓ డాక్టర్ నిరంజన్‌లకు సంఘం నాయకులు రాతపూర్వకంగా ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆసుపత్రి ఎంఆర్ఐ విభాగంలో సిబ్బంది స్కానింగ్ ఫిలిం కోసం వసూలు చేసే నగదు అందరి నుంచి ఒకే విధంగా తీసుకోవడం లేదని చెప్పారు. తీసుకున్న మొత్తానికి రశీదులు ఇవ్వకపోవడంతో పారదర్శకత లోపించి రోగులు తీవ్ర అసంతృప్తికి గురవుతున్నారని చెప్పారు. విభాగం వద్ద స్కానింగ్ చార్జీల ధరల పట్టికను స్పష్టంగా ప్రదర్శించాలని కోరారు. ప్రతి లావాదేవీకి తప్పనిసరిగా రశీదు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అలాగే రక్త సేకరణ విభాగంలో టోర్నీ కిట్ల బదులుగా సెలైన్ ట్రాన్స్‌ఫ్యూజన్ సెట్లు వాడటంతో రోగులకు తీవ్రమైన నొప్పి కలుగుతుందన్నారు. రోగుల భద్రత, సౌకర్యం కోసం తక్షణ చర్యలు తీసుకోవాలని విన్నవించారు. ఈ కార్యక్రమంలో బీసీ నాయకులు చింతపట్ల నాని, నిక్కు రాధాకష్ణ, పెద్ది బోయిన సాంబ, ఎం. రామరాజు, కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



డెప్యూటీ సూపరింటెండెంట్ భానుమూర్తి, ఆర్ఎంఓ నిరంజన్‌కు ఫిర్యాదు చేస్తున్న దృశ్యం

కోటి సంతకాల సేకరణ ప్రారంభం

కృత్తివెన్ను: ప్రజా సంక్షేమమే లక్ష్యంగా వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మెడికల్ కాలేజీలను కూటమి ప్రైవేటీకరణ చేపట్టడాన్ని వ్యతిరేకిస్తూ కోటి సంతకాల సేకరణ ఉద్యమం బుధవారం కృత్తివెన్ను మండలంలో జరిగింది. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ కన్వీనర్ ఉప్పాల రాము ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో పెద్ద ఎత్తున పార్టీ శ్రేణులు పాల్గొని విజయవంతం చేశారు. మండలంలోని చినగొల్లపాలెం, పడతడిక, లక్ష్మీపురం, నిడమర్రు గ్రామాల్లో సంతకాల సేకరణ నిర్వహించారు. ఈ సందర్భంగా రాము మాట్లాడుతూ ప్రస్తుత ప్రభుత్వం రెడ్‌బుక్ రాజ్యాంగం పేరుతో ప్రజలను హింసించడమే గానీ ప్రజా సంక్షేమం మరచిపోయిందన్నారు. నాడు పేద ప్రజల బిడ్డలు ఉన్నత చదువుల కోసం వైఎస్ జగన్ రూపొందించిన మెడికల్ కాలేజీలను నేడు చంద్రబాబు ప్రభుత్వం ప్రైవేటు పరం చేయడం దారుణం అన్నారు. దీనికి నిరసనగా శాంతియుత ప్రదర్శన చేపట్టిన పార్టీ శ్రేణులపై అన్యాయంగా అక్రమ కేసులు బనాయించిన విషయాన్ని గుర్తు చేశారు. కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ భూపతి రాజు, ఎంపీపీ గరుడ ప్రసాద్, జెడ్పీటీసీ సభ్యురాలు రత్నకుమారి, ఆర్టీసీ కృష్ణా రీజనల్ మాజీ చైర్మన్ మహేష్, ఏఎంసి మాజీ చైర్మన్ గంగాధర్, మండల మాజీ కన్వీనర్ వెంకటరాజు, ఎస్సీ నాయకులు జాన్‌రత్నం, దీనరాజ్ తదితరులు పాల్గొన్నారు.



చిన గొల్లపాలెంలో కోటి సంతకాల సేకరణలో పార్టీ శ్రేణులతో ఉప్పాల రాము

గూడూరు: ప్రభుత్వ మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ చేపట్టిన కోటి సంతకాల సేకరణ గురువారం తరకటూరులో ప్రారంభిస్తున్నట్లు పార్టీ మండల అధ్యక్షుడు సమ్మెట జయవర్ధన్ తెలిపారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పెడన ఇన్‌చార్జి ఉప్పాల రాము, ఆధ్వర్యంలో ప్రారంభమయ్యే కార్యక్రమం మద్దిపట్ల, పోలవరం ఐదుగుళ్లపల్లి, రామన్నపేట గ్రామాల్లో జరుగుతుందని చెప్పారు.

రుణ విమోచన పథకాన్ని అమలుచేయాలి

మోపిదేవి: కేరళ తరహా రుణ విమోచన పథకాన్ని ఆంధ్రప్రదేశ్‌లోనూ అమలు చేయాలని ఏపీ కౌలు రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండల కౌలు రైతు సంఘం రెండవ మహాసభ సమావేశం మోపిదేవిలో బుధవారం నిర్వహించారు. సీనియర్ రైతు సంఘం నాయకులు కలారి రామారావు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న మాగంటి హరిబాబు మాట్లాడుతూ స్వామినాథన్ కమిటీ సిఫార్సులు అమలుచేయాలని కోరారు. సంఘం అధ్యక్షుడిగా పండలనేని శివప్రసాద్, ఉపాధ్యక్షుడిగా ఎన్.నాంచారయ్య, సంఘం కార్యదర్శిగా మరీదు సురేష్, జాయింట్ కార్యదర్శిగా బి.గోపాలకృష్ణ, సంఘం సభ్యులుగా ఎన్.రమేష్, వి.రవీంద్రరావు, బి. రామారావు, ఏడుకొండలు, పీవీ దుర్గాప్రసాద్, కె.రామారావు, బి.వెంకటేశ్వరావు, ఎ. అప్పారావును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

నిబంధనలు పాటించాలి

శ్రీకాకుళం(ఘంటసాల): దీపావళి సందర్భంగా బాణసంచా అమ్మే వారు అధికారుల నిబంధనలు తప్పకుండా పాటించాల్సిందేనని ఘంటసాల మండల తహసీల్దార్ బి.విజయ ప్రసాద్ అన్నారు. శ్రీకాకుళం, కొడాలి, ఘంటసాల, దాలిపర్రు, లంకపల్లి గ్రామాల్లో విక్రయ కేంద్రాలు ఏర్పాటు చేయడానికి అవసరమైన స్థలాలను తహసీల్దార్ విజయ ప్రసాద్ ఆధ్వర్యంలో జాయింట్ తనిఖీ బృందం బుధవారం పరిశీలించింది.